
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0
***



నల్లగొండ
5
శనివారం 29 జూన్ 2024

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుత	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.30 (122.1967)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.70 (2.71)	30.90	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.29 (0.38)	నిల్	50

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.140 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.235



అవిశ్వాసం నెగ్గడంతో డైరెక్టర్ల విజయోత్సాహం

డీసీసీబీ పీఠంపై నుంచి బీఆర్ఎస్ ఔట్

- పదవిని కోల్పోయిన చైర్మన్ మహేందర్‌రెడ్డి
- పావులు కదిపి పీఠం కైవసం చేసుకుంటున్న కాంగ్రెస్
- వైస్‌చైర్మన్‌కు తాత్కాలిక ఇన్‌చార్జి బాధ్యతలు
- చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే!

నల్లగొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వరుస ఎన్నికల విజయాలతో ఊపుమీదున్న నల్లగొండ కాంగ్రెస్ ఖాతాలో మరో విజయం నమోదైంది. ప్రతిష్ఠాత్మకమైన ఉమ్మడి జిల్లా డీసీసీబీ అధ్యక్ష పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమైంది. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో అవిశ్వాసం నెగ్గడంతో చైర్మన్ పదవిని కోల్పోయారు. వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డికి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన సహకార అధికారులు జూలై 1న నూతన చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఉమ్మడి జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మార్గదర్శనంలో డీసీసీబీ పీఠం కైవసం చేసుకునేందుకు డైరెక్టర్లందరినీ సమీకరించి, అవిశ్వాసతీర్మానం నెగ్గేలా చూసిన మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి తదుపరి చైర్మన్‌గా ఎన్నికవడం లాంఛనమేనని తెలుస్తోంది.

అవిశ్వాసానికి అనుకూలంగా 15 మంది ఓటు

నల్లగొండలోని డీసీసీబీ కార్యాలయ సమావేశమందిరంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో జిల్లా సహకార అధికారి కిరణ్‌కుమార్ ఓటింగ్ ప్రక్రియను చేపట్టారు. నల్లగొండ డీసీసీబీలో 20మంది డైరెక్టర్ పోస్టులకు 19మంది నియమితులవగా,ఒక పోస్టు(కోఆప్షన్ సభ్యుడు) ఖాళీగా ఉంది. మొత్తం 14మందిడైరెక్టర్లు అవిశ్వాసానికి మద్దతుగా ఓటేస్తే అవిశ్వాసం నెగ్గతుంది. కాగా, సమావేశానికి వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డితో పాటు మరో 14మంది డైరెక్టర్లు హాజరై అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తారు. దీంతో నిబంధనల ప్రకారం అవిశ్వాసతీర్మానం నెగ్గినట్టు సహకార అధికారి ప్రకటించారు. ఫలితంగా చైర్మన్ మహేందర్‌రెడ్డి తన పదవి కోల్పోయారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్‌కు చెందిన గొంగిడి మహేందర్‌రెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి, రంగాచారి, అప్పిరెడ్డి హాజరుకాలేదు. ఇదిలా ఉండగా, అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నేపథ్యంలో శుక్రవారం డీసీసీబీ కార్యాలయం వద్ద సందడి నెలకొంది. కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చే డైరెక్టర్లంతా ప్రత్యేక బస్సులో సమావేశానికి చేరుకోగా,వారికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. సమావేశ మందిరం వద్ద కట్టుదిట్ట బందోబస్తు నడుమ ఓటింగ్ ప్రక్రియ సాగింది. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మునిసిపల్ చైర్మన్లు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, భార్గవ్, వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పెద్దసంఖ్యలో సింగిల్ విండో చైర్మన్లు, పార్టీ కీలక నాయకులంతా ఓటింగ్ ప్రక్రియ ముగిసి అవిశ్వాసం నెగ్గిందనే సమాచారం వచ్చేంతవరకు డీసీసీబీ కార్యాలయం వద్దే ఉన్నారు. అవిశ్వాసం నెగ్గిన తర్వాత డైరెక్టర్లు బయటికి రాగానే వారికి పూలమాలలు వేసిన కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.

రాజకీయాలకతీతంగా డీసీసీబీని ముందుకు తీసుకెళ్తాం



నల్లగొండ డీసీసీబీని గత పాలకవర్గానికి భిన్నంగా రాజకీయాలకు తావులేకుండా రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు తీసుకెళ్తాం. మహేందర్‌రెడ్డి ఏకపక్ష వైఖరి, అక్రమాలకు విసిగిన తర్వాతే డైరెక్టర్లంతా అవిశ్వాసం పెట్టాలనే నిర్ణయానికి వచ్చాం. అవిశ్వాస నోటీసు ఇచ్చాక ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా ఎవ్వరూ లొంగకుండా అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేసి చైర్మన్‌ను గద్దెదించాం. విదేశీ పర్యటనకు వెళ్లినా, అవిశ్వాసానికి మద్దతుగా ఓటేసే నిమిత్తం వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి తిరిగి వచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు. మొత్తం 15మంది డైరెక్టర్ల మద్దతుతో జూలై 1న జరిగే ఎన్నికలో డీసీసీబీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుంది.

\- కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్

శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే

డీసీసీబీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో తదుపరి ప్రక్రియను అధికారులు వెంటనే చేపట్టారు. వైస్ చైర్మన్‌గా ఉన్న ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డికి ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. అదే సమయంలో కొత్త చైర్మన్ ఎన్నికను జూలై 1న నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే 14మంది డైరెక్టర్ల బలాన్ని సమకూర్చుకున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి తదుపరి చైర్మన్‌గా ఎన్నికవడం లాంఛనప్రాయమేనని తెలుస్తోంది. కాంగ్రెస్ ముఖ్యనేతల సూచనల మేరకు అవిశ్వాస ప్రక్రియను ఆసాంతం ముందుండి నడపడంతో పాటు, ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలు, ఎమ్మెల్యేల మద్దతు ఆయనకే ఉందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

రైతు భరోసాపై.. ఏం చేద్దాం?



దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకువచ్చిన రైతుబంధు ఎంత చర్చనీయాంశమైందో ఈ పథకం అర్హులైన రైతులకంటే అనర్హులకే అత్యధికంగా ఉపయోగపడిందన్నా విమర్శలు వెలువెత్తాయి. ప్రధానంగా బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో బంజరు భూములకు, గుట్టలకు, రాళ్లు, రప్పలకు, ఇటుక బట్టీలు ఉన్న స్థలాలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, జాతీయ రహదారులకు ఇచ్చిన భూములకు, కాల్వలకు రైతు బంధ కింద సాయం అందడంతో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ఈ పథకంలో మార్పులు తెచ్చి రైతు భరోసా పేరుతో పెట్టుబడి సాయం అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోంది. -నల్లగొండ

- వచ్చే నెల 4 వరకు కొనసాగనున్న కార్యక్రమం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రతీరోజు 27 సమావేశాలు
- రైతుల నుంచి సలహాలు, సూచనలు సేకరించనున్న అధికారులు

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌నకు మూడు రోజుల ముందు రైతుల నుంచి, ప్రతిపక్ష పార్టీల నుంచి ఒత్తిడి రావడంతో గత ప్రభుత్వం మాదిరిగానే రైతుబంధు కింద పెట్టుబడి సాయాన్ని ఇచ్చింది. ప్రస్తుత వానాకాలం నుంచి మాత్రం రైతు భరోసా పేరుతో పథకాన్ని మార్చి అందులో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

గత ప్రభుత్వ హయాంలో రైతుబంధుతో ఎంతో మంది రైతులకు పెట్టుబడి సాయంగా ప్రయోజనం చేకూర్చినా, ఈ పథకం అమలులో ఉన్న లోపాలను సరిదిద్దకుండా 11 విడతలుగా నగదును రైతుల ఖాతాలో జమ చేసింది. ఈ పథకం ప్రారంభంలో మొదట చెక్కుల రూపంలో పెట్టుబడి సాయం ఇచ్చిన ప్రభుత్వం, ఆ తరువాత రైతుల ఖాతాల్లో జమచేస్తూ వచ్చింది. ప్రభుత్వం విడుదలచేసిన వందల కోట్ల రూపాయలు రైతులకు ఉపయోగపడకుండా గుట్టలకు, వెంచర్లకు, సేద్యం చేయని భూములకు, వ్యవసాయేతర భూములకు సైతం పట్టదారు పాస్‌పుస్తకాల ఆధారంగా రైతు బంధు సాయాన్ని ఇవ్వడం ఆరోపణలకు తావిచ్చింది.

పథకంపై రైతుల అభిప్రాయాల సేకరణ

అత్యధిక వ్యయంతోపాటు ప్రభుత్వంపై ఆర్థిక భారం పడటం, అనర్హులకు కూడా పెట్టుబడి సాయం అందుతుండటంతో వృథాను అరికట్టేందుకు ప్రభుత్వం రైతు బంధుపై దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో ఈ పథకం అమలుపై రైతుల నుంచే అభిప్రాయాలను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు రైతుల నుంచి అభిప్రాయ సేకరణకు పూనుకుంది. అందుకు జిల్లా సహకారశాఖ అధికారులకు, వ్యవసాయశాఖ అధికారులకు బాధ్యతలు అప్పగించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 107 ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. జిల్లా సహకార అధికారులతో కలిసి వ్యవసాయశాఖ అధికారులు పీఏసీఎస్‌ల వద్ద జనరల్ బాడీ సమావేశం నిర్వహించి, సభ్యులైన రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేయనున్నారు. ఎంత మేరకు రైతుభరోసా ఇవ్వాలి? ఎన్ని ఎకరాలకు ఇవ్వాలి? సాగు చేసే భూములకే ఇవ్వాలా? అని ప్రశ్నించి రైతుల అభిప్రాయాలు సేకరించనున్నారు. ఉమ్మడి జిల్లాలో శనివారం నుంచి ప్రతీరోజు 27 సమావేశాలు నిర్వహించనున్నారు. ఒక్కో జిల్లాలో జిల్లా సహకారశాఖ అధికారి మూడు సమావేశాలు, సహకారశాఖలో అడిట్ అధికారి మూడు సమావేశాలు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మూడు సమావేశాల చొప్పున నిర్వహిస్తారు. ఒక్కో జిల్లాలో తొమ్మిది జనరల్ బాడీ సమావేశాలు, మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 27 సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయం తీసుకుని, ఏ రోజుకు ఆరోజు ప్రభుత్వానికి నివేదించనున్నారు.

వచ్చే నెల 4 వరకు అభిప్రాయాల సేకరణ



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రాథమిక సంఘాల ఆధ్వర్యంలో రైతు భరోసాపై ఈనెల 29 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేయనున్నాం. ప్రతీ రోజు ఒక్కో అధికారి మూడు జనరల్ బాడీ సమావేశాలను నిర్వహిస్తారు. సొసైటీల్లో సభ్యులైన రైతుల నుంచి అభిప్రాయాలు తీసుకుంటాం. వాళ్లు ఇచ్చిన సలహాలు, సూచనలను నివేదిక ద్వారా ప్రభుత్వానికి అందజేస్తాం.

\- ఆర్.కిరణ్‌కుమార్, నల్లగొండ డీసీవో

మినిట్స్ రూపంలో రైతుల సూచనలు నమోదు



పీఏసీఎస్‌ల వద్ద జనరల్ బాడీ సమావేశాలు నిర్వహిస్తాం. సొసైటీల్లో రిజిస్టర్ అయిన సభ్యుల ద్వారా సలహాలు, సూచనలు తీసుకుంటాం. రైతుల అభిప్రాయాలను మినిట్స్ రూపంలో నమోదు చేయడంతోపాటు, వారు ఇచ్చిన సమాచారాన్ని,సలహాలను ఏరోజుకు ఆరోజు ప్రభుత్వానికి నివేదిస్తాం. రైతుబంధు సాయం పారదర్శకంగా అర్హులైన రైతులందరికీ అందించేందుకు ప్రభుత్వం ఈ ఆదేశాలను జారీ చేసింది.

\- పి.శ్రవణ్‌కుమార్, నల్లగొండ జేడీఏ

పారదర్శకత కోసం ప్రభుత్వం కొత్త పంథా

రైతుబంధు విషయంలో గత ప్రభుత్వంపై ఎన్ని ప్రశంసలు వచ్చాయో, అంతే విమర్శలు ఎదుర్కొంది. దీంతో ఈ పథకం అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పంథాను ఎంచుకుంది. గత ప్రభుత్వం ప్రతీ సీజన్‌కు ఎకరాకు రూ.5వేలు పెట్టుబడి సాయం ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.7500చొప్పున, రెండు సీజన్లకు కలిపి రూ.15వేలు ఇవ్వనుంది. దీంతో రైతుభరోసా సాయం పెరుగుతన్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వడపోత కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే ప్రభుత్వమే పెట్టుబడి సాయాన్ని తగ్గిస్తే విమర్శలు వస్తాయన్నా ఆలోచనతో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేయాలని నిర్ణయం తీసుకుంది. దీంతో అర్హులైన రైతులకు రైతుభరోసా అందడంతో పాటు కోత పెట్టారన్నా విమర్శలకు వీలు లేకుండా పారదర్శకంగా పథకం అమలులోకి తెచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జూలై 4వ తేదీ వరకు అభిప్రాయ సేకరణ చేయనుండగా, 10వ తేదీలోగా అభిప్రాయాల ఆధారంగా రైతుభరోసాను అమలులోకి తీసుకురానుంది.

పంతం వీడిన డాక్టర్లు

- అదనపు కలెక్టర్ పూర్ణచంద్రతో చర్చలు సఫలం
- మెరుగైన సేవలే లక్ష్యంగా కలిసి పనిచేసేందుకు సంసిద్ధత
- ఆర్ఎంవోతో కలిసి జిల్లా స్థాయి అధికారుల పరిశీలనకు అంగీకారం



వైద్య ప్రతినిధి బృందంతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

నల్లగొండ, జూన్ 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): నల్లగొండ జిల్లా కేంద్ర ప్రధాన ఆసుపత్రిలో రెండు రోజులుగా నెలకొన్న ఉద్రిక్తతకు తెరపడింది. ఇతర శాఖల అధికారుల తనిఖీలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ రెండు రోజులుగా సమ్మెకు దిగిన ప్రొఫెసర్లు, డాక్టర్లు, సిబ్బంది, కార్మికులు శుక్రవారం అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పూర్ణచంద్రతో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె విరమించి విధుల్లోకి వెళ్లారు. నల్గొండ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్‌వర్మ, ఎల్.రమేష్, తెలంగాణ డాక్టర్ల బోధనాసిబ్బంది అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, గిరిధర్‌నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిత్యానందంతో కూడిన బృందం శుక్రవారం అదనపు కలెక్టర్ పూర్ణచంద్రతో చర్చలు జరిపారు. ఈ చర్చల అనంతరం వివరాలను అదనపు కలెక్టర్ వెల్లడించారు. ఆసుపత్రి తనిఖీలకు, పరిశీలనకు వచ్చే జిల్లా అధికారులు సూపరింటెండెంట్ నియమించే ఒక ఆర్ఎంవోతో కలిసి తనిఖీలు చేసేందుకు అంగీకరించారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించడమే అందరి లక్ష్యంగా కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చర్చల మేరకు శనివారం నుంచి సూపరింటెండెంట్ నియమించే ఆర్ఎంవోతో కలిసి జిల్లా స్థాయి పరిశీలకులు ఆసుపత్రిలో రోగులకు అవసరమైన, పాలనాపరమైన విభాగాలను తనిఖీ చేస్తారని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర వెల్లడించారు.

వైద్యుల సమ్మెతో రోగుల ఇక్కట్లు

నల్లగొండ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సమ్మెకు దిగడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వైద్యులు అత్యవసర సేవలు మినహా ఓపీ, ఇతర సేవలను బహిష్కరించారు. జిల్లా ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువ. నిత్యం 400 వరకు అవుట్‌పేషంట్లు వస్తుంటారు. సమ్మె విషయం తెలియక చాలామంది జ్వరం, ఇతర రోగాలతో బాధపడేవారు ఆసుపత్రికి రాగా సేవలు బంద్ చేయడంతో ఇబ్బందులు పడ్డారు. జూనియర్ డాక్టర్లు, నర్సులు, వార్డ్‌బాయ్‌లు కూడా సమ్మెలో పాల్గొనడంతో రోగులకు కనీస సేవలు అందలేదు. కొందరు రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించగా, మరికొందరు వైద్యం కోసం వైద్యులు, సిబ్బందిని వేడుకోవడం కనిపించింది. శుక్రవారం సాయంత్రానికి సమ్మె విరమించి వైద్యసేవలు కొనసాగించడంతో రోగులు ఊపిరిపీల్చుకున్నారు.

నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

పెద్దవూర, జూన్ 28: డీలర్లు నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తుంగతుర్తి గ్రామంలో పంటల నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎరువుల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను, పురుగు మందులు అందించాలన్నారు. అదేవిధంగా ఏవోలు, ఏఈవోలతో సమావేశం నిర్వహించి పంటల నమోదుకు కచ్చిత సమాచారాన్ని సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సందీప్‌కుమార్, ఏఈవోలు, ఎరువుల డీలర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'పది' సప్లిమెంటరీలో 78.03శాతం ఉత్తీర్ణత

నల్లగొండ, జూన్ 28: జిల్లాలో ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. మొత్తం 801 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 625మంది (78.03శాతం)ఉత్తీర్ణత సాధించారు. బాలురు 518మంది పరీక్ష రాయగా, 400మంది ఉత్తీర్ణత (77.22శాతం) సాధించారు. బాలికలు 283 మంది పరీక్ష రాయగా, 225మంది(79.51శాతం) ఉత్తీర్ణులయ్యారు.

రీకౌంటింగ్ కోసం ఒక్కో సబ్జెక్టు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని విద్యాశాఖ కల్పించింది. ఈ రుసుమును ట్రెజరీ చాలన్ ద్వారా వచ్చే నెల 8వ తేదీలోగా చెల్లించాలని అధికారులు తెలిపారు. అదేవిధంగా రీవెరిఫికేషన్, ఫొటో కాపీ, ఆన్సర్ బుక్ కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని, ఈ-చాలన్ ద్వారా సదరు రుసుమును వచ్చే నెల 8వ తేదీలోగా చెల్లించాలని సూచించారు.

పనులను వేగవంతం చేయాలి

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్-1 ఔట్‌లెట్, నక్కలగండి రిజర్వాయర్
- నక్కలగండి రిజర్వాయర్‌ను పరిశీలించి, భూనిర్వాసితులతో మాట్లాడిన కలెక్టర్



శ్రీశైలం సొరంగమార్గం టన్నెల్ వద్ద అధికారులతో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

దేవరకొండ/చందంపేట, జూన్ 28: శ్రీశైలం సొరంగమార్గం టన్నెల్-1 ఔట్‌లెట్, నక్కలగండి రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి టన్నెల్ కాంట్రాక్టర్, నీటిపారుదలశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి నక్కలగండి రిజర్వాయర్, శ్రీశైలం సొరంగమార్గం టన్నెల్-1 ఔట్‌లెట్‌ను పరిశీలించారు. ట్రైన్‌లో జేపీ కంపెనీ, నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి సొరంగంలోకి వెళ్లి పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టిన జయప్రకాష్ అసోసియేట్ కంపెనీ ప్రతినిధులు, నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సొరంగమార్గం టన్నెల్ పథక వివరాలను జేపీ కంపెనీ ఏజెన్సీ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ కలెక్టర్, ఎస్పీలకు వివరించారు.సొరంగమార్గం టన్నెల్ ప్రపంచంలోనే అతిపెద్ద 5వ పొడవైన టన్నెల్ అని, ఇంకా 43.93 కిలోమీటర్లు తవ్వాల్సి ఉందన్నారు. టన్నెల్ ద్వారా 4వేల క్యూసెక్కుల నీటిని తీసుకువెళ్లే సామర్థ్యంతో డిజైన్ చేశారని, గరిష్ఠంగా 5,570క్యూసెక్కుల నీటి సామర్థ్యం టన్నెల్‌కు ఉంటుందని, రూ.1925కోట్ల అంచనా వ్యయంతో టన్నెల్ నిర్మాణ పనులు చేపట్టగా ప్రస్తుతం అంచనాల మేరకు ప్రాజెక్టు రూ.4,658.59 కోట్లకు పెరిగిందని కలెక్టర్‌కు వివరించారు. టన్నెల్ నిర్మాణం ఆలస్యానికి రాష్ట్ర విభజన, కరోనా, టన్నెల్ బే రింగ్‌మిషన్ మరమ్మతులకు గురికావడం, తదితర సాంకేతిక అంశాలను ఏజెన్సీ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్ కలెక్టర్, ఎస్పీలకు వివరించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ టన్నెల్-1 పనులను వేగవంతం చేయాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ అందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. అంతకుముందు నక్కలగండి రిజర్వాయర్ను ఎస్పీ, అధికారులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. భూనిర్వాసితులతో మాట్లాడారు. నక్కలగండి రిజర్వాయర్ పనులు 90శాతం పూర్తయ్యాయని, రెండు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, వారందరికీ పునరావాసం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు, దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, టన్నెల్-1 ఈఈ సత్యనారాయణ, డీఈ చక్రపాణి, లలిత, ఇంజనీర్లు మహేందర్, రవిరాజ్, జయప్రకాష్ అసోసియేట్ లిమిటెడ్ ప్రతినిధులు దీపక్‌జైన్, వీరేందర్‌సింగ్, చందంపేట తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ లక్ష్మీల చ్చిరాం, అధికారులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించాలి

చందంపేట: ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. చందంపేట తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను త్వరగా పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీరాములు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో లక్ష్మీ, ఎంపీపీ పార్వతి, అధికారులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులు అధైర్యపడొద్దు

- ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది
- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, జూన్ 28: చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపునకు గురైన బాధిత భూ నిర్వాసితులు అధైర్య పడొద్దని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పిస్తామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. డిండి ఎత్తిపోతల పథకంలో, చర్లగూడ రిజర్వాయర్ కట్ట నిర్మాణంలో భాగంగా నర్సిరెడ్డి గ్రామం నుంచి వెళ్లే దారిని పూడ్చివేస్తుడటంతో రెండు రోజుల నుంచి పనులను అడ్డుకున్న విషయం తెలిసిందే. స్పందించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నేరుగా ప్రాజెక్టు పనుల వద్దకు వెళ్లి పరిశీలించారు. అనంతరం కట్టవద్దకు వచ్చిన భూ నిర్వాసితులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీ సమస్యలు పరిష్కరించడంకోసమే వచ్చానని వారికి వివరించారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పనులను మాత్రం అడ్డుకోవద్దని, పనులకు సహకరించాలన్నారు. ఇప్పటికే మీకు అన్యాయం జరిగింది, మీకు న్యాయం చేయడంకోసం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిలో రెండు, మూడు నెలల్లో ముఖ్యమంత్రిని ఒప్పించి పునరావాసం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి నర్సిరెడ్డిగూడెం నుంచి శివన్నగూడెం వెళ్లడానికి దారి ఏర్పాటు చేశామని సూచించారు. ముందుగా రిజర్వాయర్‌కు అతి సమీపంలో ఉన్న నర్సిరెడ్డిగూడెం ముంపునకు గురవుతున్నందున, చర్లగూడెం రిజర్వాయర్‌లో 289 ఇళ్లు ఉన్నాయని, వారికి పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇరిగేషన్ అధికారి రాములు, డీఈ కాశీంలతో మాట్లాడి రోడ్డు మ్యాపును పరిశీలించారు. ఆయనవెంట నిర్వాసితులు సత్తయ్య, ఏసుబ్, యాదయ్య, మంగమ్మ, పార్వతమ్మ, చంద్రయ్య, వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్‌లతో పాటు ఎంపీపీ గండికోట రాజమణి, యాదయ్య, రాందాసు శ్రీనివాస్, రాపోలు యాదగిరి పాల్గొన్నారు.

గత ప్రభుత్వం చర్యలతోనే ప్రాజెక్టు పూర్తి కాలేదు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలతో చర్లగూడెం ప్రాజెక్టు పూర్తి కాలేదని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రిజర్వాయర్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్ పనులు మొదలు పెట్టి పదేళ్లు పూర్తి కావొస్తున్నా, నీళ్లు ఎక్కడ నుంచి వస్తాయో తెలియకుండా ప్రాజెక్టును కేసీఆర్ ప్రారంభించారన్నారు. ఈ ప్రాజెక్టు వర్షపు నీటితో నిండేది కాదని, ప్రాజెక్టు పూర్తయినా, ఇందులోకి నీరు రాదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం రూ.6వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇప్పటివరకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. త్వరలోనే రిజర్వాయర్ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తుందన్నారు.

డిండి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల



- ప్రాజెక్టుల పనులను పరుగు పెట్టిస్తాం
- ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను సందర్శించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్యే బాలునాయక్

•7లో..

జంక్షన్ అటెన్షన్

- త్రిపుల్ ఆర్ ఇంటర్ చేంజ్ జంక్షన్‌పై ఉత్కంఠ
- సమాచారం కోసం భూ యజమానుల ఆసక్తి
- ఎక్కడి వరకు భూమి, భవనాలు తొలగిస్తారని ఉత్కంఠ
- ఇప్పటికే పూర్తయిన డ్రోన్ సర్వే





ఇంటర్ చేంజ్ జంక్షన్ ప్రారంభం కానున్న 55వ కిలో మీటరు రాయి, ఇంటర్ చేంజ్ జంక్షన్ ప్రతిపాదిత ప్రాంతంలో చేసిన మార్కింగ్

చౌటుప్పల్ టౌన్, జూన్ 28: చౌటుప్పల్ పట్టణంలోని హైదరాబాద్-విజయవాడ 65వ నెంబర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేయనున్న త్రిపుల్ ఆర్ ఇంటర్ చేంజ్ జంక్షన్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ జంక్షన్ ఏర్పాటుకోసం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు భూ సేకరణ చేస్తారని, భవనాలను ఎంతవరకు తొలగిస్తారన్న దానిపై ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది. జంక్షన్‌లో కోల్పోయే ఆస్తుల వివరాలను తెలుసుకునేందుకు ఆ ప్రాంతంలోని భూములు, భవనాల యజమానులు ఆరాటపడుతున్నారు. కానీ ఖచ్చితమైన సమాచారం దొరక్క టెన్షన్ పడుతున్నారు. హైదరాబాద్‌నుంచి విజయవాడ వైపు వెళ్లే హైవేలో 55వ కిలోమీటర్ రాయి వద్ద నుంచి కిలోమీటర్ పొడవున ఈ జంక్షన్‌ను ఏర్పాటు చేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ త్రిపుల్ ఆర్ బృందం దాదాపు ఖరారుచేసింది. చౌటుప్పల్, లింగోజీగూడెం, తాళ్లసింగారం, తంగడపల్లి గ్రామాలకు చెందిన భూములను డ్రోన్ సర్వే నిర్వహించింది. అందుకు సంబంధించిన సర్వే నెంబర్ల వివరాలను రెవెన్యూశాఖకు పంపించారు. ఎన్‌హెచ్‌ఏఐ త్రిపుల్‌ఆర్ వింగ్ నుంచి నోటిఫికేషన్ వెలువడిన వెంటనే భూములు, భవనాలను కోల్పోయే యజమానులకు రెవెన్యూ శాఖ నోటీస్‌లను జారీచేసి సమగ్రమైన సర్వేను చేపట్టనుంది. మరో 10 నుంచి 15 రోజుల్లో భూముల సర్వే ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఆలోపు త్రిపుల్ ఆర్ బృందంతో స్థానిక భూసేకరణ, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అన్ని విషయాలపై సమీక్ష చేయనున్నారు. భూములకు విలువ కూడా నిర్ధారించనున్నారు. హైవే వెంట ఉన్న భూములకు ప్రత్యేకమైన నష్ట పరిహారాన్ని ఖరారు చేసే అవకాశాలున్నాయి.

జాతీయ రహదారికి ఇరువైపులా ..

జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న 46 సర్వే నెంబర్లు సర్వేచేసి భూముల లెక్కలతో పాటు హద్దులను నిర్ధారించనున్నారు. చౌటుప్పల్ పట్టణంలో 34 సర్వే నెంబర్లు, తంగడపల్లిలో ఆరు, తాళ్లసింగారంలో నాలుగు, లింగోజీగూడెంలో రెండు సర్వే నెంబర్లను డ్రోన్ ద్వారా సర్వేచేసి గుర్తించారు. ఈ నెంబర్లలో రెండు వందల ఎకరాల భూములు ఉన్నట్లు ప్రాథమిక అంచనా. చౌటుప్పల్ పరిధిలో 165 ఎకరాలు, తాళ్లసింగారంలో 11, లింగోజీగూడెంలో 2, తంగడపల్లిలో 16ఎకరాల భూములు ఉన్నాయి. రెవెన్యూ శాఖ సర్వేచేసిన అనంతరం భూముల విస్తీర్ణం మరింతగా పెరిగే అవకాశాలున్నాయి.

ఇంటర్ చేంజ్ జంక్షన్

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ఏర్పాటుచేస్తున్న త్రిపుల్‌ఆర్ ఇంటర్ జంక్షన్‌కు సుమారు 200ఎకరాల భూములను కేటాయిస్తున్నారు. ఈ జంక్షన్‌లో వాహనాల పార్కింగ్, హోటళ్లు, విశ్రాంతి భవనాలు, మినీ సినిమా థియేటర్, కాన్ఫరెన్స్ హాల్, పార్కులు తదితర సౌకర్యాలను కల్పించనున్నట్లు సమాచారం. ఈ జంక్షన్‌ను హైదరాబాద్‌నుంచి విజయవాడకు వెళ్లే జాతీయ రహదారిపై 55వ కిలోమీటర్ రాయి నుంచి 56వ కిలోమీటర్ రాయి వరకు నిర్మించనున్నారు. త్రిపుల్‌ఆర్ రోడ్డు పైకి, కిందకు వాహనాలు వెళ్లే దారులు అదనం. జాతీయ రహదారికి దక్షిణ భాగంలోని శ్రీనీ ఫార్మాకంపెనీ, మారుతీ కాటెక్స్ కంపెనీల మధ్య నుంచి ఈ రింగ్ రోడ్డు వెళ్లనుంది.

మార్కెట్ విలువ ప్రకారం చెల్లించాలి

జాతీయ రహదారి వెంట ఉన్న ఆస్తులను కోల్పోయే యజమానులకు మార్కెట్ విలువ ప్రకారంగా నష్టపరిహారాన్ని చెల్లించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. త్రిపుల్ ఆర్‌లో ఆస్తులను కోల్పోయే వ్యక్తులకు మార్కెట్ విలువను చెల్లించినపక్షంలో ఇతర ప్రాంతాల్లో ఆస్తులను కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, లేదంటే తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పాత గుర్తులు ఏవీ ఉండొద్దని..

- కేసీఆర్, జగదీష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డిల ఫొటోలు, కుర్చీపై గులాబీ కండువా సైతం తొలగింపు





కేసీఆర్, జగదీష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి ఫొటోలను తొలగిస్తున్న కాంగ్రెస్‌నేతలు, కుర్చీపై గులాబీ కండువా తొలగిస్తున్న నాయకుడు



క్యాంపు నుంచి నేరుగా డీసీసీబీ కార్యాలయానికి వస్తున్న డైరెక్టర్లు

నల్లగొండ, జూన్ 28: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో శుక్రవారం ఆసక్తికరమైన సంఘటన కన్పించింది. డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం నెగ్గిన వెంటనే సంబంధిత శాఖ చైర్మన్ చాంబర్ కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు, మద్దతుదార్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. తాత్కాలిక చైర్మన్‌గా వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మహేందర్‌రెడ్డి డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగినన్ని రోజులు ఆయన ఛాంబర్‌లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో కలిసి ఉన్న ఫొటోలు ఉన్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గి ఆయన చైర్మన్ పదవీ కోల్పోగానే ఓ ప్రజాప్రతినిధి ఆదేశాలతో ఆ ఫొటోలన్నింటిని తొలగించి కార్యాలయం నుంచి బయటకు తీసుకువెళ్లారు. చైర్మన్ ఛాంబర్‌లోని కుర్చీపై ఉన్న గులాబీరంగు కండువాను కూడా తొలగించారు. క్షణాల్లోనే ఈ ఆసక్తికర పరిణామాలను గమనించిన ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రేణులు సైతం ఔరా? ఇంతలోనే అంత మార్పు అంటూ చర్చించుకోవడం కనిపించింది. ఛాంబర్ నుంచి తొలగించిన గ్రూపు ఫొటోల్లో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చేరిన కొంతమంది డైరెక్టర్లతోపాటు, కొంతమంది ముఖ్య నాయకుల ఫొటోలు ఉండటం గమనార్హం.



తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దయాకర్‌రెడ్డి

వైభవంగా ఊంజల్ సేవ

- యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూన్ 28: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శుక్రవారం సువర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాతసేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమలతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని శ్రీరామలింగేశ్వర స్వామివారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలోని ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులతో మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.18,29,075 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

అలరించిన పాతాళభైరవి నాటక ప్రదర్శన


యాదగిరీశుడి సన్నిధిలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం అలరించాయి. కొండపైన ఆలయ ఉత్తర మాడవీధిలోని షెడ్డు కింద నాటక ప్రదర్శనకు వేదిక ఏర్పాటు చేయగా శ్రీవినాయక నాట్యమండలి (సురభి)చే పాతాళభైరవి నాటకం ప్రదర్శించారు. తోటరాముడు, మాంత్రికుడు, యక్షిణి కన్య పాత్రల్లో కళాకారులు ఆకట్టుకున్నారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత ఆర్.వేణుగోపాల్‌రావు దర్శకత్వంలో నాటకం ప్రదర్శించారు.



నాటక ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

● జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల అబార్షన్ల దందా
● లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న సీటీ స్కానింగ్ సెంటర్లు
● హుజూర్‌నగర్‌లో ప్రైవేట్ ఆసుపత్రులు కేంద్రంగా అబార్షన్లు
● ప్రైవేట్ ఆసుపత్రులలో పెద్దఎత్తున అబార్షన్లు
● ఆసుపత్రి డాక్టర్లను అరెస్ట్ చేసిన చివ్వెంల పోలీసులు
● డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో సుహాసిని మృతిపై విచారణ

కడుపుకోత



అవగాహనలేమితో కొందరు.. ఆడపిల్లలు వద్దని మరికొందరు.. అబర్షాన్లు చేయించుకుంటూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కాసులకు కక్కుర్తి పడుతున్న ఆసుపత్రుల నిర్వాహకులు ఇష్టం ఇచ్చినట్లు ఆపరేషన్లు చేస్తూ.. అమాయకుల ప్రాణాలు బలిగొంటున్నారు. ఇంత జరుగుతున్నా వైద్యఆరోగ్య శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● హుజూర్‌నగర్

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఏడు నెలల గర్భిణికి అబార్షన్ చేసిన కేసులో ఇద్దరు డాక్టర్లు, నలుగురు ఆర్‌ఎంపీలు, ఇద్దరు నర్సులను చివ్వెంల పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో అబార్షన్ వ్యవహారం సంచలనంగా మారింది. చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన గిరిజన మహిళ రత్నావత్ సుహాసినికి భర్త రత్నావత్ హరిసింగ్ అబార్షన్ చేయించారు. దీంతో ఆమె పరిస్థితి విషమించి, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటనతో శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు, ఆర్ఎంపీలు, ఆసుపత్రి సిబ్బందిని చివ్వెంల పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేసి మహిళ మృతికి కారణమైన ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బందిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల దందా మరోసారి చర్చనీయాంశంగా మారింది.

ప్రైవేట్ దందా.. మూడు పువ్వులు.. ఆరుకాయలుగా..

హుజూర్‌నగర్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల దందా మూడుపువ్వులు ఆరుకాయలుగా కొనసాగుతోంది. మైనర్లకు అబార్షన్లతో నయాదందా కొనసాగిస్తున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంతోపాటు సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలలోని ఆర్ఎంపీ డాక్టర్ల ద్వారా అనేకమందికి అబార్షన్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. హుజూర్‌నగర్ కేంద్రంగా లింగగిరి రోడ్డు, మెయిన్‌రోడ్డులోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులలో అబార్షన్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. హుజూర్‌నగర్‌లోని ఆసుపత్రులో నెలకు సుమారు 30 నుంచి 50 వరకు అబార్షన్లు చేస్తున్నట్లు సమాచారం. ఒక్కో కేసు నుంచి రూ.30వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నాలుగు రోజుల క్రితం చివ్వెంల మండలానికి చెందిన సుహాసినికి మూడో కాన్పులో కూడా ఆడపిల్ల ఉందని తెలుసుకున్న కుటుంబ సభ్యులు పట్టణంలోని లింగగిరి రోడ్డులో గల ఆసుపత్రికి రాగా అబార్షన్ చేశారు. ఏడు నెలల గర్భిణి అయిన ఆమెకు టాబ్లెట్లతో గర్భాన్ని తీసేందుకు ప్రయత్నించగా తీవ్రంగా రక్తస్రావం కావడంతో హుజూర్‌నగర్ నుండి కోదాడ, అక్కడి నుండి ఖమ్మంకు తరలించే ప్రయత్నంలో ఆమె మృతి చెందింది. కాగా ఈ సంఘటనలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పట్టణంలోని రెండు ప్రైవేట్ ఆసుపత్రులలో పెద్ద మొత్తంలో మైనర్లకు అబార్షన్లు చేస్తున్నట్లు తెలిసింది. ఆసుపత్రిలో కనీసం పేర్లు కూడా నమోదు చేసుకోకుండా మైనర్లకు అబార్షన్లు చేస్తున్నారు. పేరు మోసిన కొంతమంది డాక్టర్లు అబార్షన్లకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తుంది. ప్రైవేట్ ఆసుపత్రులలో నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్నా ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

సీటీ స్కాన్‌చేసి లింగనిర్ధారణ



జిల్లాలోని హుజూర్‌నగర్, సూర్యాపేట, కోదాడలలోని సిటీ స్కానింగ్ సెంటర్‌లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల నుండి సిటీ స్కాన్ చేసి లింగ నిర్ధారణ చేసిన తర్వాత ఆర్ఎంపీల ద్వారా హుజూర్‌నగర్‌లోని మూడు ప్రైవేట్ ఆసుపత్రులలో పెద్ద ఎత్తున అబార్షన్లు చేస్తున్నారు. పట్టణంలోని పేరు మోసిన ప్రైవేట్ వైద్యశాలలే కేంద్రంగా పెద్ద ఎత్తున అబార్షన్లు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొంతమంది ఆర్ఎంపీల సహకారంతో హుజూర్‌నగర్ కేంద్రంగా చేస్తున్నటువంటి అబార్షన్ల వ్యవహారం సుహాసిని ఉదంతంతో వెలుగు చూసింది. మఠంపల్లి మండలానికి చెందిన కొంతమంది ఆర్ఎంపీలు మైనర్లను తీసుకొచ్చి అబార్షన్లు చేయిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. జిల్లాలో సిటీ స్కానింగ్ సెంటర్లు పెద్ద ఎత్తున లింగ నిర్ధారణ చేస్తున్నా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల యజమానుల నుండి నెలనెల పెద్ద ఎత్తున మామూళ్ళు అందడం తోనే లింగనిర్ధారణ పరీక్షలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా హుజూర్‌నగర్ పట్టణంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను నిర్వహించే వారికి ఎలాంటి అనుమతులు లేకున్నా వైద్యం చేస్తున్నారు. కొంతమంది వ్యక్తులు ఆసుపత్రులను లీజుకు తీసుకుని కొంతమంది డాక్టర్ల పేర్ల మీద అనుమతులు తీసుకుని ఎంబీబీఎస్ పట్టా లేని వారితో వైద్యం చేయిస్తున్నారు. పేరొకరిది వైద్యం మరొకరు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని అనేక ప్రాంతాలలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్న వారికి హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులలో అబార్షన్లు చేస్తున్నట్లు సుహాసిని ఉదంతం వెలుగు చూసిన నేపథ్యంలో జిల్లా వైద్యాధికారులు నేటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.



సుహాసిని అబార్షన్, మృతిపై చివ్వెంల పీహెచ్‌సీలో విచారణ

చివ్వెంల: జిల్లాలో సంచలనంగా మారిన చివ్వెంల మండల పరిధిలోని ఎంజీనగర్ తండాకు చెందిన సుహాసిని అబార్షన్, మృతిపై జిల్లా వైద్యాధికారులు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విచారణ నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సుహాసిని వివరాలను తెలుసుకున్నారు. మొదటి, రెండు కాన్పులకు స్థానిక ఎంజీనగర్ తండాలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త.. స్థానిక ఏఎన్ఎంకు సమాచారం ఇచ్చారు. కానీ మూడోసారి గర్భందాల్చినప్పటి నుంచి ఆ విషయాన్ని రహస్యంగా ఉంచడంతో ఆ విషయం తమ దృష్టికి రాలేదని మండల వైద్యాధికారి భవాని తెలిపినట్లు అధికారులు వివరించారు.

చివ్వెంల పోలీస్ స్టేషన్‌కు బదిలీ...?

చివ్వెంల మండల పరిధిలోని ఎంజీనగర్ తండాకు చెందిన సుహాసిని అబార్షన్, మృతిపై సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు. ఇదే కేసును సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి చివ్వెంల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. ఇదే విషయమై ఎస్ఐ బి.వెంకట్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం : కోటాచలం

గిరిజన మహిళకు అబార్షన్ చేసి ఆమె మృతికి కారణమైన వారిపై విచారణ చేస్తున్నామని జిల్లా వైద్యాధికారి కోటాచలం తెలిపారు. మృతురాలు కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించామన్నారు. జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కమిటీ వేసి చివ్వెంల మండలంలో విచారణ చేశామన్నారు. హుజూర్‌నగర్‌లోని ఆసుపత్రుల పైన త్వరలోనే విచారణ చేస్తామన్నారు.

కల్తీ పదార్థాలు విక్రయిస్తే చర్యలు

● భూదాన్‌పోచంపల్లిలో సూపర్ మార్కెట్ల తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు



సూపర్ మార్కెట్‌లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 28: సూపర్‌మార్కెట్లలో కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమన్ కల్యాణ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి హెచ్చరించారు. భూదాన్‌పోచంపల్లిలోని సూపర్ మార్కెట్‌లు, రిలియన్స్ మార్కెట్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిలియన్స్ మార్కెట్‌లో విక్రయించే ప్రతీ వస్తువుపై తయారీ, గడువు ముగిసే తేదీలు తప్పకుండా ఉండాలన్నారు. అనుమతి పొందిన పదార్థాలను మాత్రమే విక్రయించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూదాన్‌పోచంపల్లిలోని రిలియన్స్ స్మార్ట్ పాయింట్‌లో కుళ్లిన కోడిగుడ్లు విక్రయాలపై వినియోగదారుడు కీర్తి సంజీవ ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు శుక్రవారం పట్టణంలోని స్మార్ట్ పాయింట్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణంలోని ప్రతీ వస్తువును తనిఖీ చేసి నమూనాలు సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు. సేకరించిన ఆహార నమూనాలు కల్తీ అని తేలితే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

తొమ్మిది దుకాణాలపై కేసులు నమోదు

దేవరకొండ: దేవరకొండలోని దుకాణాల్లో లీగల్ మెట్రాలజీశాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేసినట్లు జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. దేవరకొండ పట్టణంలోని శ్రీపద్మ కిరాణం,జనరల్ స్టోర్స్, జాహ్నవి ట్రేడర్స్, ఎస్ఎల్ఎన్ స్వామి కిరాణం, ధనలక్ష్మీ ట్రేడర్స్ అండ్ కో, గోపికృష్ణ కిరాణం, అంజలి సూపర్‌మార్కెట్, నాళ్ల పెద్దమారయ్య కిరాణం, లక్ష్మీగణపతి కిరాణం, సాయిలక్ష్మీ కిరాణాలలో ప్యాకేజీలపై వివరాలు సరిగా లేకపోవడంతో తొమ్మిది కేసులు నమోదుచేసి రూ.1.80లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. తూకాలలో మోసాలకు పాల్పడితే తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



బెల్లం పానకం పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

కొండమల్లేపల్లి, జూన్ 28: నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలలో 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. మండలంలోని కేశ్యతండ, మేఘ్యతండాల్లో శుక్రవారం దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సారా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ మల్లేష్, వై.వేణుగోపాల్‌రెడ్డి, కృష్ణ, శేఖర్‌రెడ్డి, నాగరాజు, అనిల్, మహేశ్ తదితరులున్నారు.

ఎప్పుడూ ఫోన్ చూస్తూ ఉంటావా?

● తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య ● నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో ఘటన



వల్లూరి శివ(ఫైల్)

మునుగోడు రూరల్, జూన్ 28: ఎప్పుడూ ఫోన్ చూస్తూనే ఉంటావా? అని తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే కొరటికల్ గ్రామానికి చెందిన వల్లూరి లింగయ్యకు కుమారుడు శివ(22), కుమార్తె ఉన్నారు. లింగయ్యకు తొమ్మిది ఎకరాల పొలం ఉండగా, శివ నాలుగేళ్లుగా తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఇంటర్ వరకు చదివిన శివ సీజనల్‌గా వ్యవసాయ పనులకు, పత్తి పనులకు వెళుతుండేవాడు. కొంత కాలంగా ఫోన్ విపరీతంగా చూస్తుండడంతో, నిత్యం ఫోన్‌లో ఏముంది రా..? ఫోన్ చూస్తూ టైంపాస్ చేస్తున్నావు..? అని తండ్రి లింగయ్య గురువారం మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన శివ అదే రోజు సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి పక్కనే ఉన్న శివ బాబాయ్ వెళ్లి చూసే సరికి ఉరివేసుకొని బలవన్మరణం చెందాడు. వల్లూరి లింగయ్య ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నిమిత్తం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మునుగోడు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తండ్రి మందలించాడని క్షణికావేశంలో శివ బలవన్మరణం చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

దేవరకొండలో ఉరి వేసుకొని..

దేవరకొండ, జూన్ 28: దేవరకొండ పట్టణంలోని ఖిల్లా బజార్‌కు చెందిన మేకల నర్సింహ(24) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖిల్లా బజార్‌కు చెందిన మేకల కృష్ణయ్య, దుర్గ దంపతుల రెండో కుమారుడైన నర్సింహ పట్టణంలోని ఓ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన తల్లిదండ్రులు తలుపులు ధ్వంసంచేసి చూడగా, అప్పటికే నర్సింహ మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదని మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరసింహులు తెలిపారు.

నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నోముల గ్రామస్థులు

నకిరేకల్, జూన్ 28: నకిరేకల్ మండలం నోముల గ్రామంలోని నీడలేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. మండలంలోని నోముల గ్రామానికి చెందిన పలువురు నిరుపేదలు తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నూనె వెంకటస్వామి మాట్లాడుతూ గ్రామంలోని 500 పేద కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు గ్యార సాలయ్య, కాడింగు సైదులు, మధుగౌడ్, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో తీవ్ర గాయాలు



కోతుల దాడిలో గాయపడిన వెంకటేశ్వర్లు

మఠంపల్లి, జూన్ 28: కోతుల దాడిలో సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం రఘునాథపాలెం గ్రామ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఉండే 50 కోతులు గ్రామంలోకి ప్రవేశించాయి. తమ ఇంటిపైకి వస్తున్న కోతులను నాయుడు వెంకటేశ్వర్లు నివారించే ప్రయత్నం చేయగా, ఒక్కసారిగా కోతులు మూకుమ్మడిగా అతనిపై దాడి చేశాయి. తీవ్ర గాయలైన వెంకటేశ్వర్లును చికిత్స నిమిత్తం కోదాడకు తర్వాత ఖమ్మం తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

టికెట్లు సేకరించిన వ్యక్తిపై ఫిర్యాదు

భువనగిరి అర్బన్, జూన్ 28: ప్రత్యేక దర్శనం వెళ్లాల్సిన భక్తులు పొరపాటున ధర్మదర్శనం క్యూకాంప్లెక్స్ ద్వారా గోల్డెన్ క్యూలైన్ గుండా వెళ్లిన రూ.150 టికెట్ల భక్తుల నుంచి టికెట్లు సేకరించి తిరిగి విక్రయించేందుకు యత్నించిన కొబ్బరికాయలు కొట్టే టంటం వెంకటేష్‌పై ఆలయ అధికారులు యాదగిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు శక్రవారం ఫిర్యాదుచేశారు. పొరపాటున ధర్మదర్శనం క్యూలైన్‌కు చేరుకున్న వీఐపీ టికెట్లు భక్తులనుంచి సదరు వ్యక్తి టికెట్లు తీసుకున్నట్లు ఎస్పీఎఫ్ సిబ్బంది సీసీ ఫుటేజీలను పరిశీలించి నిర్ధారించారు. అర్థభాగం కొబ్బరి చిప్పలు సేకరించే కాంట్రాక్టర్ వద్ద పనిచేసే సిబ్బంది నుంచి సంబంధిత టికెట్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. అవే టికెట్లను తిరిగి భక్తులకు విక్రయించేందుకు ప్రయత్నించగా దేవస్థానానికి ఆర్థిక నష్టం కలిగిస్తున్నాడని సదరు వ్యక్తిపై ఫిర్యాదు చేయడమేకాక అర్థభాగం కొబ్బరిచిప్పల సేకరణ టెండర్ రద్దు చేసేందుకు గాను కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేసినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్ట్

● పరారీలో మరో ఇద్దరు

చిట్యాలరూరల్, జూన్ 28: చైన్‌స్నాచింగ్ చేసిన నలుగురిలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ జిల్లా చిట్యాల ఎస్ఐ సైదాబాబు తెలిపారు. ఈ నెల 24వ తేదీన చిట్యాల మండలం ఏపూర్ గ్రామ పరిధిలోని పిశాటిగూడెంలో పిశాటి సుగుణమ్మ ఇంట్లోకి దొంగలు ప్రవేశించి ఆమె మెడలోని పుస్తెలతాడును దొంగిలించి పరారయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసును సాంకేతికతను ఉపయోగించి దర్యాప్తు చేస్తుండగా నలుగురు దొంగల పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. దొంగతనంలో చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడేనికి చెందిన సంపంగి కళ్యాణ్, మరో మైనర్ పట్టుబడ్డారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి సొమ్మును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును అపహరించుకుపోయారు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అబ్బిరెడ్డిగూడెం గ్రామ పరిధిలోని సుభాష్‌నగర్‌కు చెందిన గాదె రామనర్సమ్మ పొలం వద్దకు వెళ్లగా.. మధ్యాహ్నం ఎవరూలేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును ఎత్తుకొని పరారయ్యాడు. రామనర్సమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు.

దేవరకొండలో ఆటో అపహరణ

దేవరకొండ, జూన్ 28: దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డులో ఇంటి ఎదుట నిలిపిన టీఎస్ 05యూఏ 9748 నెంబర్ గల ఆటోను గురువారం రాత్రి గుర్తు తెలియని దొంగలు అపహరించారు. ఉదయాన్నే లేచిచూసిన ఆటో యజమాని రామకృష్ణ ఆటో కనిపించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికాడు. అయినా ఫలితంలేకపోవడంతో దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వైద్యపోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి టౌన్, జూన్ 28: భువనగిరి జిల్లాకేంద్ర ఆసుపత్రిలో మూడు సివిల్ అసిస్టెంట్ సర్జన్ (గైనకాలజీ స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతు కె.జెండగే, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ చిన్న నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అర్హులైన వైద్యులు ఈ నెల 29 నుంచి జూలై 8 వరకు జిల్లా ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయనున్న పోస్టులకు నెలకు రూ.లక్ష గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు, డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికలు ఉంటాయన్నారు.

'పదోన్నతుల్లో ఎస్జీటీలకు అన్యాయం'

నల్లగొండ, జూన్ 28: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరిగిందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదావత్ లచ్చిరాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రమోషన్ ద్వారా ఎస్జీటీ ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు అన్ని కేటగిరీల పదోన్నతుల్లో నష్టం జరిగిందన్నారు. పదోన్నతుల్లో సీనియార్టీ జాబితాల్లో తరువాత ఉన్న వారికి పదోన్నతిని ఈ షెడ్యూల్‌లోనే కల్పించాలని కోరారు.

వేలంలో రూ.22.50 లక్షల ఆదాయం

దామరచర్ల, జూన్ 28: మండలంలోని కల్లెపల్లి గ్రామంలో శ్రీబంగారు మైసమ్మ తల్లి దేవస్థానంలో ఒక సంవత్సరం కాలపరిమితి వరకు వివిధ హక్కుల కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.22.50 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి, చైర్మన్ ధీరావత్ భాష్యానాయక్ తెలిపారు. శుక్రవారం ఆలయ ఆవరణలో నల్లగొండ దేవాదాయశాఖ కమిషనర్ కె.మహేంద్రకుమార్ పర్యవేక్షణలో వేలంపాట నిర్వహించారు.

విద్యుదాఘాతంతో మేనమామ, అల్లుడు మృతి

● జేవైర్‌పై టవల్ ఆరేస్తుండగా అల్లుడికి విద్యుదాఘాతం ● అల్లుడిని కాపాడబోయి మామ మృత్యువాత ● నకిరేకల్ మండలంలో ఓగోడ్‌లో ఘటన





జానయ్య, వీరేందర్(ఫైల్)

నకిరేకల్, జూన్ 28: నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం ఓగోడు గ్రామంలో గురువారం రాత్రి విద్యుదాఘాతంతో మేనల్లుడు, మేనమామ మృతి చెందారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఓగోడు గ్రామానికి చెందిన మాద వీరేందర్ (35) గురువారం రాత్రి ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూంలో స్నానం చేసి బయటకు వచ్చి జేవైరు తీగపై తడిసిన టవల్‌ను ఆరేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. పక్కనేఉన్న ఆయన భార్య పావని కేకలు వేయడంతో ఇంటి పక్కనే ఉన్న మేనమామ భూపతి జానయ్య(42) అదే సమయంలో ఆయన కూడా స్నానం చేసి టవల్ కట్టుకుని మేనల్లుడిని కాపాడేందుకు కర్రతో జేవైర్‌ను కొట్టే క్రమంలో మంటలు ఎగిసి జేవైర్ తెగి జానయ్యపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు 108కు సమాచారం అందించడంతో ఇద్దరిని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి, హుటాహుటిన తరలించగా, అప్పటికే వారిద్దరూ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఇంటి ఆవరణలో బట్టలు ఆరేసేందుకు ఏర్పాటుచేసిన జేవైర్‌కు ఇంట్లో విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ స్తంభం నుంచి ఏర్పాటు చేసుకున్న కరెంట్ వైర్ జేవైర్‌కు అనుకోవడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిసింది. వీరేందర్‌కు భార్య, ఇద్దరు కుమారులు, జానయ్యకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఇద్దరు ఒకేసారి విద్యుదాఘాతానికి గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలకు శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే వీరేశం

విద్యుదాఘాతంతో మృతి చెందిన వీరేందర్, జానయ్య కుటుంబాలను ఓగోడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే వీరేశం పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబాలకు చెరి రూ.25వేల చొప్పున నగదును ఆయన అందజేశారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దైద రవీందర్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అనంతగిరి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని తెల్లబండ తండాలో విద్యుదాఘాతంతో ఒకరు మృతిచెందినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన బానోతు సోమ్లా(50) వసంతపురం గ్రామంలో గల ఆములూరి రామయ్య మామిడితోటకు ఉన్న ఫెన్సింగ్ వైర్‌కు ప్రమాదవశాత్తు తగిలాడని, ఆ ఫెన్సింగ్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి పెద్ద కుమారుడు రామకృష్ణ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నేరేడుచర్ల, జూన్ 28: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సెంట్రింగ్ మేస్త్రి ఎస్‌కే యూసుఫ్(55) అక్కడికక్కడే మృతి చెందినట్లు నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపారు. నేరేడుచర్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన యూసుఫ్ సెంట్రింగ్ పని నిమిత్తం నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడ వైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా కడప నుంచి జగ్గయ్యపేటకు రసాయన లోడుతో వెళుతున్న డీసీఎం ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో యూసుఫ్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు ఎస్‌కె యూనస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యూసుఫ్, ఇన్‌సెట్‌లో (ఫైల్)

ప్రాజెక్టుల పనులను పరుగు పెట్టిస్తాం

● డిండి ప్రాజెక్టు నీటి విడుదల
● ఎమ్మెల్యే బాలునాయక్


డిండి ప్రాజెక్టు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

డిండి, జూన్ 28: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టు పనులను పరుగులుపెట్టిస్తామని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం డిండి ప్రాజెక్టు నీటిని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి కుడి, ఎడమకాల్వలకు ఆయన నీటిని విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను త్వరలో సందర్శించనున్నట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న సింగరాజుపల్లి, గొట్టిముక్కల రిజర్వాయర్లకు రూ.50 కోట్లు కేటాయించాలని నీటి పారుదల శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. డిండి మండల కేంద్రంలోని అంగడిబజార్ నుంచి విత్తనోత్పత్తి క్షేత్రం వరకు రెండు లైన్ల సీసీరోడ్డు నిర్మాణానికి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని, రైతుభరోసా కింద రూ.15 వేలు ఇస్తామన్నారు. గత ప్రభుత్వంలో వెంచర్లు, జాతీయ రహదారులకు కూడా రైతుబంధు అందజేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా రైతుభరోసా అందజేస్తుందని తెలిపారు. అమ్మ ఆదర్శపాఠశాలలు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు మరమ్మతులు చేపట్టి విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేందుకు నియోజకవర్గంలో రూ. 10 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మండల కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న మోడల్‌స్కూల్ పాఠశాల నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్యం, సాగునీటి రంగాలకు మొదటి ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు రూ.5కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయిపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో ఎంపీపీ మాధవరం సునీతజనార్దన్‌రావు, జడ్పీటీసీ మాధవరం దేవేందర్‌రావు, ఎంపీటీసీలు వెంకటయ్య, రాధిక, నీ టిపారుదలశాఖ ఈఈ శ్రీధర్‌రావు, డి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో డానియెల్, రాజేష్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, డీఈ శ్రీనివాస్, జేఈ ఫయాజ్, కర్నాకర్, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్, పున్న దినేష్, మేకల కాశయ్య పాల్గొన్నారు.

సమీక్ష జరగకుండానే ముగిసిన సర్వసభ్య సమావేశం

డిండి: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మాధవరం సునీతజనార్దన్‌రావు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం ఆయా శాఖలపై సమీక్ష జరగకుండానే ముగిసింది. సభ్యులకు చివరి సర్వసభ్య సమావేశం కావడంతో వారిని ఎమ్మెల్యే బాలునాయక్ సన్మానించారు. బదిలీపై వెళ్లిన తహసీల్దార్ తిరుపతయ్యను సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ రైతుల ఆధీనంలో ఉన్న నీటిపారుదలశాఖ భూముల క్షేత్రస్థాయి వివరాలను కలెక్టర్, తహసీల్దార్ నివేదించినట్లు తెలిపారు. ఆయా రైతులకు పట్టాలు జారీ చేస్తామని తెలిపారు. సమావేశంలో అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్యాధికారి కల్యాణ్‌చక్రవర్తి


జ్వర బాధితుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కల్యాణ్‌చక్రవర్తి

దామరచర్ల, జూన్ 28: ప్రస్తుత వర్షాకాలంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి కల్యాణ్ చక్రవర్తి సూచించారు. మండలంలోని యాదాద్రి థర్మల్ పరిశ్రమలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. పరిశ్రమలోని కార్మికులకు జ్వరాలు ప్రబలడంతో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అదేవిధంగా మురుగునీటి నిల్వలు లేకుండా చేసి పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. అనంతరం పరిశ్రమలో జ్వరాల బారిన పడిన కార్మికులకు అందిస్తున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, మండల వైద్యాధికారి నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

18ఏళ్ల లోపు పిల్లలను చదువుకోనివ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న చింత కృష్ణ

నల్లగొండ, జూన్ 28: బాల్యం పిల్లల హక్కు అని, 18 సంవత్సరాల వరకు బాలబాలికలను చదువుకోనివ్వాలని బాలల సంక్షేమ సమితి చైర్మన్ చింత కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం నేషనల్ ఆదివాసీ సాలిడారిటీ కౌన్సిల్ (ఎన్ఏఎస్ఈ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. పిల్లను పనిలో పెట్టుకున్నట్లయితే బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, నియంత్రణ చట్టం కింద యజమానులు శిక్షకు గురవుతారని అన్నారు. పిల్లలను చదివించి ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. నల్లగొండ సీడీపీవో నిర్మల మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకొని ఉన్నతస్థాయి ఎదగాలని ఆకాక్షించారు. బాల్యవివాహాలను ఎవరూ ప్రోత్సహించవద్దని అన్నారు. చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ మహేష్ మాట్లాడుతూ బాలలు ఆపద సమయంలో 1098కు కాల్ చేస్తే ఆపదలో ఉన్న బాలలను ఆదుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పి.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గీత

చండూరు, జూన్ 28: గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసినందున ప్రత్యేక అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ అవ్వారు గీత శ్రీనివాస్, జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం మొదలైనందున సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, అంటువ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడకుండా వైద్యాధికారులు గ్రామాల్లో ప్రత్యేక అధికారులతో సమన్వయంతో అరికట్టాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గ్రామాల్లో కుక్కల బెడద, కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని సభ్యులు ఆరోపించారు. ప్రజాప్రతినిధుల పదవీ కాలం ముగుస్తున్నందున కార్యాలయ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో ఎంపీడీవో అనురాధ, తహసీల్దార్ అనురాధ, సూపరింటెండెంట్ మనోహర్, పీఆర్ ఏఈ రమేష్, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

చింతపల్లి, జూన్ 28: ఎరువుల డీలర్లందరూ ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని దేవరకొండ డివిజన్ వ్యవసాయ సంచాలకురాలు శ్రీలక్ష్మి అన్నారు. చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్ (మాల్)లో శుక్రవారం డీలర్లకు నిర్వహించిన సమావేశంలో ఏవో శ్రావణకుమారితో కలిసి ఆమె మాట్లాడారు. డీలర్లందరూ నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని సూచించారు. అధికారుల సూచనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మధు, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచుకోవాలి


పీహెచ్‌సీలో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

వేములపల్లి, జూన్ 28: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధని అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వేములపల్లి పీహెచ్‌సీలో సమగ్ర సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులతో వైద్యులు సహృదయ భావాన్ని కలిగి అవసరమైన మందులను అందించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు తంగెళ్ల నాగమణి, పెంటమల్ల సుకన్య పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

త్రిపురారం జూన్ 28: క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎస్సీసెల్ జిల్లా మాజీ కోకన్వీనర్ కొండ భాస్కర్, మండల నాయకుడు నంద్యాల రంగారెడ్డి, గజ్జి శ్రీకాంత్, అర్వెనబోయిన కోటయ్య అన్నారు. మండలంలోని కోమటిగూడెంలో నేతాజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. నేతాజీ యువసేన ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 32 టీంలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. టోర్నమెంట్‌లో ప్రథమ హుమతి వెనిగండ్ల, ద్వితీయ కోమటిగూడెం (ఏ), తృతీయ బహుమతి కోమటిగూడెం (బి)టీం, చతుర్థ బహుమతి బాబుసాయిపేట జట్లు గెలుచుకున్నాయి. విజేతలకు వారు నగదు బహుమతులతో పాటు షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో బూర మధు, జొన్నలగడ్డ రవి, మధు, అనుముల శివ, శశికుమార్, మహేష్, చిన్ని పాల్గొన్నారు.

గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 28: జనాభాకు తగ్గట్లుగా బీసీ గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలని గురుకుల సెక్రటరీ సైదులుకు వినతిపత్రం అందజేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. బీసీ విద్యార్థులు వేలాది సంఖ్యలో ఉండగా సీట్ల సంఖ్య వందల్లో ఉండటం వల్ల విద్యార్థులకు ప్రవేశం లభించడం లేదన్నారు. గురుకులాల్లో సీట్లు పెంచితే బీసీ విద్యార్థులలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గుంటి మహేష్, బంటు వెంకటేశ్వర్లు, నాగేందర్, కొండల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి తనవంతు కృషి : జడ్పీటీసీ

వేములపల్లి, జూన్ 28: మండల అభివృద్ధికి తనవంతుగా నిరంతరం కృషి చేస్తానని జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో జడ్పీ నిధులతో చేపడుతున్న డ్రైనేజీ, వైకుంఠధామం పనులను శుక్రవారం వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధనితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, వెంకటయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించాలి

మిర్యాలగూడ, జూన్ 28: కస్తుర్బాగాంధీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి విద్యార్థినుల సమస్యలను తొలగించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్, సైదానాయక్ కోరారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

పోలీసులు ప్రతి ఫిర్యాదుపై స్పందించాలి


కొండమల్లేపల్లి స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్రపవర్

దేవరకొండ, పెద్దఅడిశర్లపల్లి, పెద్దవూర, హాలియా, కొండమల్లేపల్లి, జూన్ 28: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ డివిజన్‌లోని పలు పోలీస్‌స్టేషన్లను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను భద్రపరిచే విధానాన్ని పరిశీలించి రికార్డులను ఆయన తనిఖీ చేశారు. నేరాలు, తదితర వివరాలను డీఎస్పీ గిరిబాబు, సీఐలను అడిగి తెలుసుకున్నారు. ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదుపై సత్వరమే స్పందించి సేవలందించాలని సూచించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పాటుపడాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాలు, కట్టడాలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

● దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో నేరాలు, తదితర వివరాలను డీఎస్పీ గిరిబాబు, సీఐ నర్సింహులును అడిగి తెలుసుకున్నారు. ఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత దేవరకొండకు వచ్చిన ఆయనకు డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు ఘనస్వాగతం పలికారు.

● పెద్దఅడిశర్లపల్లి మండలంలోని గుడిపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్పీ పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో విగ్రహ ప్రతిష్ఠ పనులు జరుగుతుండటం, ఆవరణలో గుడి ఉండటం, దాని చుట్టూ కంచె వేయడాన్ని చూసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు, సీఐ ధనంజయ్యగౌడ్, ఎస్ఐ నర్సింహులు ఉన్నారు.

● పెద్దవూర పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి నేరాల గురించి ఎస్పీ ఎస్ఐ వీరబాబును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, నాగార్జునసాగర్ సీఐ బీసన్న, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

● హాలియా మండల పరిధిలో గల గ్రామాల గురించి, పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాల గురించి ఎస్పీ శరత్‌చంద్రపవార్ సీఐ, ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్, ఎస్ఐ సతీష్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించిన ఆయన కేసుల పురోగతి, కేసుల పెండింగ్, శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ గిరిబాబు, సీఐ ధనుంజయ, ఎస్ఐ రామ్మూర్తి ఉన్నారు.

ఫీడర్ ఛానల్ మరమ్మతులకు కృషి : సామేల్


ఫీడర్ ఛానల్ షట్టర్లను పరిశీలిస్తున్న మందుల సామేల్

శాలిగౌరారం, జూన్ 28: మండలకేంద్రంలోని శాలిగౌరారం ప్రాజెక్టు ఫీడర్ ఛానల్‌ను ఎమ్మెల్యే మందుల సామేల్ ఆయకట్టు రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. రామన్నపేట మండలం పల్లివాడ నుంచి శాలిగౌరారం ప్రాజెక్టు వరకు ఉన్న ఫీడర్ ఛానల్ పరిధిలోని బంధం, బాచుప్పల, సూరారం, తుర్కపల్లి మధ్య ఉన్న షట్టర్లను పరిశీలించారు. వందేళ్ల క్రితం నిర్మించిన ఈ షట్టర్లు శిథిలమైనట్లు తెలిపారు. ఫీడర్ ఛానల్‌కు కూడా అక్కడక్కడ గండ్లు పడుతున్నాయని, దీంతో ప్రాజెక్టులోకి నీరు రావడం లేదని రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎమ్మెల్యే షట్టర్లు, ఫీడర్ ఛానల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరలో వెంటనే ఐబీ అధికారులతో మాట్లాడి ఫీడర్ ఛానల్ మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయించి నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. శిథిలమైన షట్టర్లకు నిధులు మంజూరైనా సంబంధిత కాంట్రాక్టరు పనులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నందున చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, షేక్ ఇంతియాజ్ అహ్మద్, చాడ సురేష్‌రెడ్డి, చామల వెంకటరమణారెడ్డి, మాజీసర్పంచ్ బండారు శంకర్, శాలిగౌరారం ఎంపీటీసీ జోగు సైదమ్మ శ్రీనివాస్, బండెపల్లి కొమరయ్యగౌడ్, గూని వెంకటయ్య, నరిగె నర్సింహ, పడాల సత్తయ్య, పడాల రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు డిపో ఆదాయాన్ని పెంచాలి


దేవరకొండలో మొక్కలు నాటుతున్న ఆర్ఎం రాజశేఖర్

దేవరకొండ, జూన్ 28: ఆర్టీసీ ఉద్యోగులు విధులు సమర్థవంతంగా నిర్వహించి డిపో ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని నల్లగొండ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. దేవరకొండ బస్ డిపో, బస్టాండ్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని, నిజాయతీతో విధులు నిర్వహించాలని కోరారు. దేవరకొండ డిపోను ఆదాయంలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలపాలని అన్నారు. ప్రయాణికుల కోరిక మేరకు బస్సులను నిలపాలని, మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం డిపోలో ఉత్తమ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం మాధవి, ఇన్‌చార్జి డీఎం బీపాల్, అసిస్టెంట్ మేనేజర్ సైదులు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ కార్మికులు శనివారం గేటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ వేతన బకాయిలు చెల్లించాలని, అవసరమైన సిబ్బందిని నియమించాలని కోరారు. దీర్ఘకాలంగా సంస్థలో నియామంకాలు జరగకపోవడంతో ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపై అదనపు భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థను విలీనం చేసుకున్న ప్రభుత్వం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేవీరెడ్డి, కడియం రమేష్, సంతోష్‌రెడ్డి, నిర్మల, శారద, సరస్వతి, కోటయ్య, నారాయణ, చంద్రయ్య, కనకయ్య, ఆర్కే నాయక్ తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడలో గేటు ధర్నా నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మికులు

ప్రభుత్వ హామీలన్నీ వెంటనే అమలుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ, జూన్ 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కిసాన్‌మోర్చా జిల్లా పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఒకేసారి చేయాలని, రైతుభరోసా సహాయం ఎకరానికి రూ.15వేలు విడుదల చేయాలని, ఆయిల్‌ఫామ్ రైతులకు కేంద్రం ఇస్తున్న సహాయం హెక్టార్‌కు రూ.10,500 వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు ఇవ్వాలని, జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి భూగర్భజలాలను కాపాడాలని డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చకపోతే జూలై రెండో వారంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కోశాధికారి కన్మంతరెడ్డి అశోక్‌రెడ్డి, నాయకులు భవనం మధుసూదన్‌రెడ్డి, చలమల్ల సీతారాంరెడ్డి, నవీన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బిక్షమాచారి, సత్యనారాయణ, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి

నల్లగొండరూరల్, జూన్ 28: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను ప్రైవేటీకరణ చేయడానికి వేలం వేయాలని చూస్తోందని, రాష్ట్రంలో ఉన్న బొగ్గు గనులను నేరుగా సింగరేణి సంస్థకు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, తీగల సాగర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సుభాష్ విగ్రహం వద్ద సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్రం బీజేపీ ప్రభుత్వం వేలంపాటను వేస్తుందని అన్నారు. సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలంపాటలో పోటీపడాలని కేంద్రం పేర్కొనడం విడ్డూరమని అన్నారు. బొగ్గు గనులన్నీ ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణి మిగిలేదేముంటుందని, క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చే స్తుందని అన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణతో విద్యుత్ ధర విపరీతంగా పెరుగుతుందని అన్నారు. కేంద్ర నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్‌లను కూడా తక్షణమే సింగరేణి అప్పగించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండా శ్రీశైలం, వి.వెంకటేశ్వర్లు, మహ్మద్ సలీం, నర్సిరెడ్డి, దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, కుంభం కృష్ణారెడ్డి, అర్రూరి శ్రీను, మంగారెడ్డి, అశోక్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నర్సింహ, రవి, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

హాలియా, జూన్, 28: హాలియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు జూలై 3వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్ తెలిపారు. కళాశాలలో తెలుగు 1, ఇంగ్లీష్ 2, కామర్స్ 2, కంప్యూటర్ సైన్స్ కంప్యూటర్ అప్లికేషన్ 1, పొలిటికల్ సైన్స్ 1, బోటనీ 1, జువాలజీ 1 సబ్జెక్టుల నియామకానికి పీహెచ్‌డీ, నీట్, సెట్ గల వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ఇంటర్వ్యూ తేదీ దరఖాస్తుల స్వీకరణ అనంతరం తెలియజేయనున్నట్లు పేర్కొన్నారు.

చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలి

● చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్

నల్లగొండరూరల్, జూన్ 28: చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పవర్‌లూమ్ పరిశ్రమలు, కార్మికులను ఉపాధి అవకాశాలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మగ్గం నడవాలి, నేతన్న బతకాలి అనే నినాదంతో 7వ తేదీన సిరిసిల్లలో నేతన్న పోరుయాత్ర ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ బస్సుయాత్ర జూలై 15న హైదరాబాద్‌కు చేరుకుంటుందని తెలిపారు. యాత్ర ముగింపు సమావేశం సందర్భంగా ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే నేతన్న గర్జన చలో హైదరాబాద్ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి దండెంపల్లి సత్తయ్య, తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేష్, నాయకులు గంజి నాగరాజు, కర్నాటి శ్రీరంగం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: రాష్ట్ర సహకార కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 30వ తేదీన నార్కట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సంఘం చైర్మన్ కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులు హాజరుకావాలని ఆయన కోరారు.

● నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు బొడిగె భరత్‌గౌడ్‌తో పాటు మరికొంత మంది కార్యకర్తలు మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఫాంహౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

నార్కట్‌పల్లి: రుణమాఫీ చేయడానికి ప్రభుత్వం రైతు పాస్‌బుక్, రేషన్‌కార్డుకు ముడిపెట్టే ఆలోచనను విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న డిమాండ్ చేశారు. రుణమాఫీ కోసం కటాఫ్ డేట్‌ను 2018 జూన్ నుంచి 2024 జూన్ వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీన చిట్యాలలోని సామ లక్ష్మీపాపిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించే పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

చందంపేట: హైదరాబాద్‌లో జూలై 7వ తేదీన నిర్వహించే ఎమ్మార్పీఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొండ్రపల్లి నగేష్ అన్నారు. మండల కేంద్రంలో ఉత్సవాల కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు.

● చందంపేట మండల కేంద్రానికి చెందిన ఇరగదిండ్ల శ్రీశైలం 25 మంది నిరుపేద కుటుంబాలకు చిరుధాన్యాలను అందజేశారు.

దామరచర్ల: విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని మండలంలోని కల్లేపల్లి ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ధీరావత్ బుజ్జిలింగానాయక్ కోరారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఆహార నాణ్యతను విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

హాలియా: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని మండలంలోని కొత్తపల్లి హెచ్ఎం దాసా వెంకన్న అన్నారు. మండలంలోని పంగవానికుంటతండాలో హెచ్ఎం నెమలి వెంకట్‌రెడ్డి పదోన్నతిపై వెళ్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని అన్నారు.

చింతపల్లి: మండలంలోని మోద్గులమల్లేపల్లి గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ మండల నాయకులు ముద్దం మల్లేష్‌గౌడ్ హైదరాబాద్‌లో కేంద్రమంత్రి జయంత్‌చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆయన మాట్లాడతూ యువతకు వృత్తి నైపుణ్య కోర్సులు ఏర్పాటు చేసి బంగారు భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని కోరారు.

● ఎమ్మెల్యే బాలునాయక్‌కి మంత్రి పదవి ఇవ్వాలని రజక సంఘం జిల్లా నాయకుడు పుప్పాల లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని మదనాపురంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలంటే మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.

మర్రిగూడ: మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన కల్లెట్ల శ్రీను కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యతో హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి రూ.2.50లక్షలు ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేయించారు. మర్రిగూడ మండల అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ యాదయ్య కుటుంబసభ్యులను అందజేశారు.

మర్రిగూడ: మురారి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు మరువరానివని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకెపల్లి గ్రామంలో శుక్రవారం మురారి వర్ధంతి సందర్భంగా ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన స్తూపానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో కమిషనర్ యూసుఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆప్ జిల్లా అధ్యక్షుడు ఖుత్బుద్దీన్ మాట్లాడుతూ పట్టణంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ల నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు. క్రీడా, వ్యాయామ సామగ్రి విరిగిపోవడంతో నిరుపయోగంగా మారాయన్నారు.

శాలిగౌరారం: బలహీన వర్గానికి చెందిన ఎస్ఐపై అసత్య ఆరోపణలు సరికాదని దళిత సంఘాల నాయకుడు దేవరకొండ శంకర్ అన్నారు. కొంతమంది నాయకులు, పైరవీకారులకు అనుకూలంగా లేక పోలీస్‌స్టేషన్‌లో పనులు జరగకపోవడం వల్ల ఎస్ఐపై కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు రింగు రాంబాబు, దేవరకొండ మస్తాన్, డి.సందీప్, రవీందర్, ఉషాన్, జానీ, ఉపేందర్ పాల్గొన్నారు.

దామరచర్ల: డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్‌పై కొందరు పనిగట్టుకొని అసత్య ఆరోపణలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. శంకర్‌నాయక్‌పై కొందరు బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలకు పాల్పడటం సరైన విధానం కాదన్నారు. తక్షణమే ఆయనపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకోవాలన్నారు.

చండూరు: చండూరు మునిసిపాలిటీలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని 4వ వార్డు కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రధాన రహదారి వెంట కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా మడిగెలు, రేకుల షెడ్లు నిర్మిస్తున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నల్లగొండ రూరల్: పట్టణంలోని మాన్యంచెల్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఐద్వా పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల పద్మ, భూతం అరుణకుమారి డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం లేక సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

నల్లగొండ: పట్టణంలోని కాకతీయ డిగ్రీ కాలేజీలో మైత్రి అకాడమీ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలపై మూడు రోజుల పాటు ఉచిత అవగాహన క్లాసులు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్లు పాముల అశోక్, వంటల రాకేష్ తెలిపారు. పోటీ పరీక్షల ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకొని ఏఏ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి, అనే అంశాలపై కరెంట్ అఫైర్స్‌లో అనుభవజ్ఞులైన వారితో జూలై 2 వ తేదీ వరకు క్లాసులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.